సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 1 । జూన్ । 2025



నవధాన్యాలతో జవసత్వాలు

దాళ్వా అనంతరం నవధాన్యాల సాగును వ్యవసాయ శాఖ అధికారులు ప్రోత్సహిస్తున్నారు. ఈ మేరకు సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేస్తున్నారు.

8లో



కిటకిటలాడిన శ్రీవారి క్షేత్రం

ద్వారకాతిరుమల శ్రీవారి దివ్య క్షేత్రం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వేలాదిగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

8లో



ముగిసిన సర్టిఫికెట్ల పరిశీలన

నూజివీడు ట్రిపుల్ ఐటీలో ప్రత్యేక కేటగిరీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం శనివారంతో ముగిసింది.

8లో

న్యూస్‌రీల్

కౌలు రైతు కార్డులు తప్పనిసరి



ప్రత్తిపాడు సచివాలయంలో కౌలు రైతు కార్డుల వివరాలు పరిశీలిస్తున్న జేసీ

పెంటపాడు: కౌలు రైతుల వద్ద కౌలు రైతు కార్డు (సీసీఆర్‌సీ) తప్పనిసరిగా ఉండాలని, దీనిపై రెవెన్యూ అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. ప్రత్తిపాడు సచివాలయం వద్ద శనివారం రైతులు, కౌలురైతులతో సమావేశం నిర్వహించి, సీసీఆర్‌సీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ కౌలు రైతు చట్టం ప్రకారం పంట పండించే వారికి పంటపై మాత్రమే హక్కు ఉంటుందన్నారు. పంట సాగు హక్కు పత్రం పొందిన రైతులకు బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ వర్తిస్తుందన్నారు. కావున భూయజమాని తన పొలాన్ని సాగుచేసే రైతుకు అంగీకార పత్రాన్ని వీఆర్వో ద్వారా అందించాలన్నారు. తద్వారా ఈక్రాప్ నమోదు చేస్తామన్నారు. అనంతరం రైతులతో మాట్లాడారు. పూర్తిస్థాయిలో కౌలు కార్డులు అందించకపోవడంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామసభల అవగాహన కల్పించాలన్నారు. డీఏఓ జెడ్. వెంకటేశ్వరరావు, ఆర్డీఓ కౌసర్ బానో, ఏడీఏ పి.మురళీకృష్ణ, ఏఓ కె.పార్థసారథి తదితరులు ఉన్నారు.

రహదారులపై సర్వే




కొయ్యలగూడెంలోని పోలవరం రోడ్డులో సర్వే చేస్తున్న అధికారులు

సాక్షి స్పందన

కొయ్యలగూడెం: కొయ్యలగూడెంలోని మెయిన్ రోడ్ల లో రెవెన్యూ అధికారులు శనివారం సర్వే చేపట్టారు. గత నెల 29న 'సాక్షి'లో 'పీజీఆర్ఎస్ తీరు అపహాస్యం' శీర్షికన ప్రచురించిన కథనానికి కలెక్టర్ స్పందించి పరిష్కారానికి చర్యలు చేపట్టాల్సిందిగా అధికారులను ఆదేశించారు. దీంతో రెవెన్యూ, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సర్వేని ప్రారంభించి మార్కింగ్ చేశారు. దాదాపు మూడు నెలల క్రితం మల్లవరపు శ్రీనివాసు అనే వ్యక్తి కొయ్యలగూడెంలో ప్రధాన జాతీయ రహదారులు ఇరువైపులా ఆక్రమణలకు గురయ్యాయని ఫిర్యాదు చేశారు. అయితే ఆన్‌లైన్‌లో సమస్యను పరిష్కరించినట్టు సమాచారం రావడంతో 'సాక్షి' ద్వారా కలెక్టర్‌కి విషయం చేరింది. దీంతో కలెక్టర్ వెట్రిసెల్వి ప్రత్యేక శ్రద్ధతో చర్యలకు ఆదేశాలిచ్చారని అధికారులు తెలిపారు.

ఏలూరులో 6 కరోనా కేసులు

మెల్లగా విస్తరిస్తున్న మహమ్మారి



ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో మెల్లగా కరోనా పాజిటివ్ కేసులు నమోదవుతున్నాయి. కరోనా వైరస్ విజృంభిస్తున్న తరుణంలో ప్రభుత్వ అధికారులు మాత్రం ప్రజలను అప్రమత్తం చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఏలూరు కలెక్టరేట్‌లో శుక్రవారం నాటికి ముగ్గురు కరోనా బారిన పడగా.. తాజాగా శనివారం మరో ఇద్దరికి కరోనా సోకినట్టు చెబుతున్నారు. అలాగే ఏలూరు అమీనాపేటలో ఒక వ్యక్తికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. వీరికి ఏలూరు జీజీహెచ్‌లో పరీక్షలు చేశారు. నగరంలో ఆరుగురికి కరోనా సోకినట్లు వైద్య అధికారులు తెలిపారు.

ట్రాన్స్‌జెండర్లకు రైస్ కార్డులు

జేసీ పి.ధాత్రిరెడ్డి

1ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలో ట్రాన్స్‌జెండర్లకు రైస్ కార్డుల జారీకి ఈనెల 4న జిల్లా పౌర సరఫరాల అధికారి కార్యాలయంలో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. ఈ కేంద్రంలో ట్రాన్స్‌జెండర్లకు రైస్ కార్డులు, ఆధార్ కార్డుల జారీ, ఆధార్ కార్డులో మార్పులు, రైస్ కార్డులో కుటుంబ సభ్యులు మార్పులు, చేర్పులు, ఆధార్ కార్డులో చిరునామా, తదితర మార్పులు చేస్తారని చెప్పారు.

యోగా రిజిస్ట్రేషన్ వేగిరపర్చాలి

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలో యోగా అభ్యాసన కార్యక్రమంలో పాల్గొనేందుకు శనివారం సాయంత్రం వరకు 6,16,530 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని జేసీ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమంలో 8.30 లక్షల మందిని భాగస్వాములను చేయాలనే లక్ష్యానికి అనుగుణంగా రిజిస్ట్రేషన్‌ను వేగిరపర్చాలని ఆదేశించారు.

వైద్యానికి సుస్తీ

ఒంట్లో నలత చేసినా ఆందోళన అక్కర్లేదు.. ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ ఫిజిషియన్ రూపంలో వైద్యులు ఊరికే వచ్చి సేవలు అందిస్తారన్న ధీమా.. ఎంత పెద్ద రోగమొచ్చినా ఆరోగ్యశ్రీ కార్డుపై రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యసాయం అందుతుందన్న భరోసా.. కోలుకునే వరకూ జీవన భృతికి ఆరోగ్య ఆసరా ఇస్తారన్న నమ్మకం.. ఇలా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదల ఆరోగ్యానికి కొండంత అండగా ఉన్న పలు కార్యక్రమాలు కూటమి ప్రభుత్వ పాలనలో కనుమరుగయ్యాయి.



పాలకొల్లులో అసంపూర్తిగా నిలిచిన మెడికల్ కళాశాల నిర్మాణ పనులు

ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం

- కూటమి పాలనలో పడకేసిన వైద్యం
- నిలిచిన ఆరోగ్య సురక్ష, ముఖ్యమంత్రి ఈఐ కేంద్రం సేవలు
- అందని ఆరోగ్య ఆసరా
- పాలకొల్లులో అటకెక్కిన వైద్య కళాశాల పనులు
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదల వైద్యానికి భరోసా
- ప్రజలకు ఆరోగ్యశ్రీ, ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు



ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల బంద్‌తో ఖాళీగా ఉన్న ఆరోగ్యశ్రీ కౌంటర్ (ఫైల్)

సాక్షి, భీమవరం : ప్రజారోగ్య పరిరక్షణకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారు. ఆరోగ్యం ప్రతిఒక్కరి హక్కుగా వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో 1,059 చికిత్సల సంఖ్య (ప్రొసీజర్ల)ను 3,257కి పెంచడంతో పాటు కుటుంబానికి రూ.5 లక్షలు ఉన్న వ్యయ పరిమితిని రూ.25 లక్షలకు పెంచారు. జిల్లాలో ఐదేళ్లలో ఈ పథకం కింద 2.05 లక్షల మందికి రూ.436.32 కోట్లు విలువైన శస్త్రచికిత్సలు అందించారు. కాగా ఎన్టీఆర్ వైద్యసేవగా పేరుమార్చిన కూటమి ప్రభుత్వం బకాయిలు విడుదల చేయకుండా రోగులను ఇబ్బందులకు గురిచేస్తోంది. జిల్లాలోని 30 వరకు ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ (ఎన్టీఆర్ వైద్యసేవ) సేవలు అందిస్తున్నాయి. రోజుకు సుమారు 1,500 వరకు ఓపీ నమోదవుతుండగా ఇన్ పేషెంట్లుగా చేరేవారు 500 వరకు ఉంటున్నారు. జిల్లాలోని నెట్‌వర్క్ ఆస్పత్రులకు సుమారు రూ.150 కోట్ల మేర బకాయిలు పెట్టడంతో గత ఏప్రిల్ రెండో వారంలో జిల్లాలోని భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, నరసాపురంలోని 19 ఆస్పత్రుల్లో సేవలను నిలిపివేయడంతో రోగులు ఇబ్బందులు పడ్డారు.

'ఆరోగ్య ఆసరా'కు ఎసరు

ఆరోగ్యశ్రీలో శస్త్రచికిత్స చేయించుకున్న రోగి కోలుకునే వరకూ వైఎస్సార్ ఆరోగ్య ఆసరాగా గత ప్రభుత్వం జీవన భృతి అందజేసింది. రోజుకు రూ.275 చొప్పున సాయం లెక్కకట్టి అందించేవారు. సాధారణ డెలివరీ, సిజేరియన్‌లకు రూ.5 వేలు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడి విరిగిన ఎముకల సర్జరీకి రూ.10 వేలు, కాళ్లకు ఇన్‌ఫెక్షన్ సంబంధించి సెల్యులైటీస్ కేసులు, కొన్ని కణుతుల చికిత్సలకు రూ.1,575.. ఇలా చికిత్సను బట్టి సాయాన్ని రోగి బ్యాంకు ఖాతాలకు జమచేసేవారు. ఐదేళ్లలో 94,000 మంది లబ్ధిదారులకు రూ.53 కోట్ల ఆర్థిక సాయం అందించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్య ఆసరా బిల్లులు చెల్లింపును నిలిపివేయడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

గత ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీలో అందించిన సేవలు

- ఉచిత అడ్మిషన్.
- అవసరమైన ఆధునిక వైద్య పరీక్షలు, మందులు.
- శస్త్రచికిత్స, అందుకు అవసరమైన మందులు, అల్పాహారం, రెండు పూటలా భోజనం.
- డిశ్చార్జ్ సమయంలో సరిపడా మందులు.
- విశ్రాంతి తీసుకునే సమయంలో ఖర్చు నిమిత్తం ఆరోగ్య ఆసరాగా లబ్ధిదారు ఖాతాలో డబ్బులు.
- ఇంటికి వెళ్లేందుకు అవసరమయ్యే ప్రయాణ చార్జీలు.
- పది రోజుల తర్వాత ఆస్పత్రికి వచ్చి ఉచితంగా వైద్య సేవలు పొందే అవకాశం.
- అవసరమైన చికిత్సలకు ఏడాది పాటు డాక్టర్ సంప్రదింపులు, వైద్య పరీక్షలు, మందులు కూడా ఉచితం.
- వైద్యం పొందే సమయంలో ఆరోగ్య మిత్ర, ఆసుపత్రి సిబ్బంది లేదా మరెవరైనా లంచం అడిగితే 14400 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేసే అవకాశం.

ఆరిపోయిన 'కంటి వెలుగు'

గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి ఈఐ కేంద్రాల ద్వారా జిల్లాలోని ఆచంట, ఆకివీడు, భీమవరం, పాలకొల్లు, నరసాపురం సీహెచ్‌సీల్లో ఉచితంగా కంటి వైద్యసేవలు అందించేవారు. అవసరమైన వారికి కళ్లజోళ్ల పంపిణీ, శస్త్రచికిత్సలు చేసేవారు. ఇలా 1,30,733 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. 1,28,358 మందికి రిఫ్రాక్షన్ చెక్స్, 53,102 మందికి ఫండస్ చెక్స్, 90,059 మందికి కళ్లజోళ్లు అందజేశారు. 884 డీఆర్, 626 గ్లకోమా, 140 మాకులర్ డిజనరేషన్, 14,080 కాటరాక్ట్, 76 హైపర్‌టెన్సివ్ రెటినోపతి రోగులను గుర్తించి సంబంధిత వైద్యసేవలు, శస్త్రచికిత్సలు నిర్వహించారు. ఈ కేంద్రాలను నిర్వహిస్తున్న కాంట్రాక్టు సంస్థతో మెమోరాండమ్ ఆఫ్ అండర్ స్టాండింగ్ (ఎంఓయూ) గడువు గతేడాది సెప్టెంబరు 4తో ముగియగా కూటమి ప్రభుత్వం రెన్యూవల్ చేయకపోవడంతో సేవలు నిలిచిపోయాయి. కంటి పరీక్షల కోసం పేదలు రూ.వేలు వెచ్చించి ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది.



పాలకోడేరు మండలం గరగపర్రులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం (ఫైల్)

నాడు సురక్ష.. నేడు శిక్ష

గత ప్రభుత్వంలో పైసా ఖర్చు లేకుండా పేదలకు వైద్య భరోసా కల్పించిన ఆరోగ్య సురక్ష శిబిరాల నిర్వహణను కూటమి ప్రభుత్వం అటకెక్కించింది. గత ప్రభుత్వం జిల్లావ్యాప్తంగా ఏర్పాటుచేసిన ఆరోగ్య సురక్ష శిబిరాల్లో 264 మంది స్పెషలిస్ట్ వైద్యులు, 132 మంది మెడికల్ ఆఫీసర్లు, ఇతర ఆరోగ్య సిబ్బంది విధుల్లో పాల్గొనేవారు. రక్తం, మూత్రం, ఈసీజీ తదితర 14 రకాల వైద్య పరీక్షలతో పాటు 172 రకాల మందులను అందుబాటులో ఉంచి అవసరమైన వారికి అందజేసేవారు. ఏడాది కాలంగా శిబిరాల నిర్వహణ లేకపోవడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు స్పెషలిస్ట్ వైద్యసేవల కోసం పట్టణాలకు పరుగులు తీయాల్సి వస్తోంది.

మెడికల్ కళాశాలపై కత్తి

వైద్య విద్యను పేదలకు చేరువ చేయడం, ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించే లక్ష్యంతో గత ప్రభుత్వం జిల్లాలోని పాలకొల్లులో చేపట్టిన మెడికల్ కళాశాలకు కూటమి బ్రేక్ వేసింది. 60 ఎకరాల్లో రూ.475 కోట్ల వ్యయంతో రెండేళ్ల క్రితం పనులు ప్రారంభించగా ఎన్నికల సమయం నాటికి రూ.74.5 కోట్ల మేర పనులు పూర్తయ్యాయి. కూటమి వచ్చాక నిధులు విడుదల చేయకపోవడంతో నిర్మాణ సంస్థ దాదాపు పనులు నిలిపివేసింది.

గత ప్రభుత్వంలో పేదల ఆరోగ్యానికి భరోసా



గత జగన్ ప్రభుత్వంలో పేదల ఆరోగ్యానికి భరోసాగా ఉండేది. ఆరోగ్యశ్రీలో సేవలు పారదర్శకంగా, ఉచితంగా అన్నిరకాల వ్యాధులకు చికిత్స లభించేది. గ్రామాల్లోకి అన్నిరకాల వైద్యులు వచ్చి వైద్యసేవలు అందించేవారు. 104 వాహనం ద్వారా డాక్టర్లు వచ్చి ఇంటింటికీ వెళ్లి మంచంపై ఉన్నవారికి, అంగన్‌వాడీ, స్కూల్ పిల్లలకు కూడా వైద్య పరీక్షలు, వైద్య సేవలు అందించేవారు. కూటమి ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేదు, ఆరోగ్యశ్రీ సేవలు కూడా నిలిపివేస్తున్నారు.

– కాండ్రేగుల శ్రీను, నరసన్న చెర్వుపాలెం, వీరవాసరం మండలం

మహిళలకు వరంగా 'సురక్ష' శిబిరాలు



గత ప్రభుత్వంలో వార్డులు, గ్రామాల వారీగా నిర్వహించిన ఆరోగ్య సురక్ష క్యాంపులు మహిళలకు, పేదలకు వరంగా ఉండేవి. ముఖ్యంగా క్యాంపులకు గైనకాలజిస్టులు, ఇతర స్పెషలిస్టుగా ఉన్న మహిళా వైద్యులు రావడంతో మహిళల్లో ఆరోగ్య సమస్యలను ఆదిలోనే గుర్తించి సకాలంలో మెరుగైన వైద్యం అందించడం, శస్త్రచికిత్స కోసం ఆరోగ్యశ్రీకి సిఫార్సు చేయడం జరిగేది. ఈ క్యాంపుల్లో మహిళల్లోని గర్భాశయ, బ్రెస్ట్ క్యాన్సర్ కేసులను గుర్తించి సకాలంలో వైద్యం అందించి ప్రాణాలను రక్షించేవారు. కూటమి ప్రభుత్వంలో సీజనల్ వ్యాధులకు మెడికల్ క్యాంపులు కూడా ఏర్పాటుచేయడం లేదు.

– పాలవెల్లి మంగ, భీమవరం

కోవిడ్ కలవరం



సమావేశానికి హాజరైన అధికారులు

ఏలూరు కలెక్టరేట్‌లోని సిబ్బందికి కరోనా భయం పట్టుకుంది. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) విభాగంలో పనిచేసే సిబ్బందికి కోవిడ్ సోకడంతో మిగిలిన సిబ్బంది శనివారం మాస్కులు ధరించి విధులకు హాజరయ్యారు. 20 సూత్రాల అమలు సమీక్షలో సైతం అధికారులు మాస్క్ పెట్టుకుని హాజరయ్యారు. ఇంకెంత మందికి కోవిడ్ సోకిందేమోనని ఉద్యోగులు భయాందోళనలో ఉన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు



కలెక్టరేట్ ఆవరణలో ఇలా..



సమీక్షలో మాస్కుతో 20 సూత్రాల చైర్మన్ దినకర్, జేసీ

నేటినుంచి ప'రేషన్'!

- ఇక రేషన్ దుకాణాల్లోనే సరుకుల పంపిణీ
- క్యూలైన్లలో గంటల తరబడి ఎదురుచూపులు తప్పవు
- దూరాభారమైనా మోయలేని బరువులతో యాతనలే..
- సర్వర్ పనిచేయక వేలిముద్రలు పడకపోతే మరింత ఇబ్బందులు



భీమవరం: రేషన్ కార్డుదారులకు చౌక డిపోల వద్దనే నిత్యావసర సరుకులు తీసుకునే కార్యక్రమాన్ని ఆదివారం కూటమి ప్రభుత్వం ప్రారంభించనుంది. కార్డుదారులు రేషన్ షాపుల వద్ద గంటల తరబడి క్యూల్లో నిలబడి మోయలేని బరువుతో ఎక్కువ దూరం తీసుకువెళ్లాల్సిన పరిస్థితులు పునరావృతం కానున్నాయి. ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ నిత్యావసర సరుకులు అందించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జ్ఞాపకాలను చెరిపేసే ఉద్దేశంతో రేషన్ డిపోల వద్దనే సరుకుల పంపిణీకి చేస్తున్న ఏర్పాట్లను ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. జిల్లాలో 5,67,671 రేషన్ కార్డులకు 1,060 డిపోల ద్వారా ద్వారా నెలకు సుమారు 8,700 టన్నుల బియ్యం, 567 టన్ను కందిపప్పు, 300 టన్నుల పంచదార పంపిణీ చేయాల్సి ఉంది. ఇందుకోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 356 ఎండీయూ వాహనాలను ఏర్పాటు చేసి వందలాది మందికి ఉపాధి కల్పించడంతో పాటు ఇంటి వద్దకే సరుకులు అందించి వృద్ధులు, మహిళలు, దివ్యాంగులకు ఊరట కల్పించింది.

ఇకపై పడిగాపులే..

సరుకులు పొందాలంటే ఇక నుంచి గంటల పాటు చౌకడిపోల వద్ద పడిగాపులు తప్పవని కార్డుదారులు ఆందోళన చెందుతున్నారు. సర్వర్ పనిచేయడం లేదంటూ, వేలిముద్రలు పడటం లేదంటూ రోజుల తరబడి చౌక డిపోల చుట్టూ తిప్పుతారని వాపోతున్నారు. బియ్యం మూటలతో దూర ప్రాంతాలకు వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడతామని అంటున్నారు. దివ్యాంగులు, 65 ఏళ్లు దాటిన వృద్ధులకు ఇంటి వద్దకే వెళ్లి రేషన్ ఇస్తామని కూటమి ప్రభుత్వం చెబుతున్నా ఆచరణలో ఎంతవరకు సాధ్యమని డీలర్లు పెదవి విరుస్తున్నారు. తాము సరుకులు తీసుకువెళ్లిన సమయంలో కార్డుదారులు వారి ఇంటి వద్ద లేకపోతే సమస్యలు తప్పవని డీలర్లు అంటున్నారు. మొత్తంగా ఎండీయూ వ్యవస్థ రద్దు, చౌక డిపోల ద్వారా రేషన్ పంపిణీపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కూటమి అండదండలతో కబ్జాలు



కొయ్యలగూడెంలో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

కొయ్యలగూడెం: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ భూములే కాకుండా ప్రజల భూములు కూడా కబ్జాలకు గురవుతున్నాయని అందుకు ఉదాహరణగా కొయ్యలగూడెంలోని సర్వే నంబర్ 311/2 నిలిచిందని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. ఆయన శనివారం కొయ్యలగూడెం వచ్చిన సమయంలో సమయంలో టీటీడీ కల్యాణ మండప ప్రాంతవాసులు తమ భూముల కబ్జాపై ఆయన వద్ద మొరపెట్టుకున్నారు. కోట్ల రూపాయల విలువైన భూమి గురించి ఇప్పటికే సమగ్రంగా విషయాలను సేకరించానని, చిన్నపాటి లొసుగులను భూతద్దంలో చూపించి భూముల కబ్జాకు పన్నాగం నడుస్తోందని బాలరాజు అన్నారు. ఈ విషయంలో ప్రజలను కంగారు పడవద్దని ఓ పక్క చెబుతూ మరోపక్క ఆక్రమణదారులకు కూటమి నాయకులు వెన్ను కాస్తున్నారని ఆరోపించారు. 40 ఏళ్లకుపైగా నివాసముంటున్న స్థానికుల జోలికి వస్తే పర్యవసానం తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. రెవెన్యూ అధికారులు కూటమి నేతల ఒత్తిళ్లకు లొంగకుండా నిష్పక్షపాతంగా సర్వే చేయాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ గంజిమాల రామారావు, పార్టీ రాష్ట్ర బీసీ సెల్ సహాయ కార్యదర్శి గంటా శీను, పట్టణ కన్వీనర్ సంకుకొండ, ఘంటసాల సాయి, మారిశెట్టి శ్రీను, చిటికెన నాగార్జున, తొంటా వాసు ఉన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 55 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ శనివారం ఐదు కేంద్రాల్లో నిర్వహించారు. ఉదయం 18 మందికి గాను 11 మంది, మధ్యాహ్నం 70 మందికి 44 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.యోహాన్ తెలిపారు.

మహానాడుతో ఒరిగిందేమీ లేదు

నూజివీడు: తెలుగుదేశం పార్టీ తన ఏడాది పాలనలో వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే మహానాడును నిర్వహించింది తప్ప దీంతో సాధించిందేమీ లేదని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.హరినాథ్ శనివారం ప్రకటనలో విమర్శించారు. సూపర్ సిక్స్ హామీల అమలులో వైఫల్యాలను మహానాడులో ఎందుకు చర్చించలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం పాలనలో ఘోరంగా విఫలమైందని, కేవలం ప్రతిపక్ష పార్టీని విమర్శించడం, ప్రతిపక్ష పార్టీ నేతలపై కేసులు పెడుతూ కాలాన్ని వృథా చేస్తున్నారన్నారు. నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు, రైతు భరోసా, ఉద్యోగ వర్గాలకు ఓపీఎస్ పునరుద్ధరణ, నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్, ఇళ్ల స్థలాల మాటలు నీటి మూటలుగా మారాయన్నారు. ఉభయ గోదావరి జిల్లాలు, రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో బర్లీ పొగాకు కొనుగోళ్లను కార్పొరేట్ సంస్థలు నిలిపివేయడంతో రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారన్నారు.

కూటమి ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధం



మహదేవపట్నంలో ఇంటి స్థలాల కోసం దరఖాస్తులు అందిస్తున్న మహిళలు

ఉండి: ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధమయ్యారని సీపీఐ నాయకులు తెలిపారు. శనివారం మహదేవపట్నంలో పలువురు మహిళలు సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో గ్రామ సచివాలయానికి వచ్చి ఇంటి స్థలాల కోసం దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సమితి సభ్యుడు గొల్లయ్య మాట్లాడుతూ అధికారంలోకి రాగానే గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇంటి స్థలం కేటాయించి, గృహ నిర్మాణానికి రూ.5 లక్షలు రుణం ఇస్తామన్న హామీని కూటమి నాయకులు అమలు చేయడం లేదన్నారు. దీంతో మండలంలోని ప్రతి గ్రామంలో మహిళలు కూటమి నాయకులపై తిరగబడేందుకు సిద్ధమవుతున్నారన్నారు. హామీల అమలుకు కూటమి నాయకులు ఎందుకు ముఖం చాటేస్తున్నారని ప్రశ్నించారు. హామీల అమలు కోసం త్వరలోనే ప్రభుత్వ కార్యాలయాల ముట్టడికి కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలు అమలుచేస్తేనే ప్రజల గుండెల్లో స్థానం సంపాదిస్తారన్నారు. సీపీఐ నాయకులు కేతా వెంకటసుబ్బారావు, వీరవల్లి పొట్టి శ్రీను, వీరవల్లి మాణిక్యాలరావు, గుత్తుల సత్తిపండు, గుత్తుల సూర్యనారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పింఛన్ల కోసం పడిగాపులు



వడలివారి వీధిలో లబ్ధిదారుల పడిగాపులు

ఆకివీడు: పింఛన్లు మే 31వ తేదీ నుంచే పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో పలు చోట్ల ప్రజలు శనివారం ఉదయం నుంచే వీధుల్లో పింఛన్ల కోసం పడిగాపులు పడ్డారు. స్థానిక వడలి వారి వీధి, సంతపేట ప్రాంతాల్లో పింఛన్ల కోసం లబ్ధిదారులు మధ్యాహ్నం వరకూ వేచి చూసినా పంపిణీ చేసే ఉద్యోగులు రాకపోవడంతో తీవ్ర నిరుత్సాహం చెందారు. తిండితిప్పలు లేకుండా, ఉక్కబోత వాతావరణంలో చెమటలు కక్కుతూ పడిగాపులు పడ్డామని వృద్ధులు, దివ్యాంగులు వాపోయారు. ఈ విషయాన్ని సాక్షి ద్వారా కమిషనర్‌కు తెలియజేయగా సంబంధిత ఉద్యోగి సెలవులో ఉన్నారని, అందువల్ల సంతపేట, ఆనాల చెరువు ప్రాంతాల్లోని పింఛన్‌దారులకు పింఛన్ పంపిణీ చేయలేదని చెప్పారు. కనీసం ఈ విషయాన్ని బాధితులకు తెలియజేసి అక్కడ నుంచి పంపించివేయండని చెప్పినా వారికి సమాచారం ఇవ్వలేదు. కుప్పనపూడి శివారు తాళ్లకోడులోని 74 ఎకరాల్లో తమకు పట్టాలిచ్చారని, అక్కడే ఇళ్లు కట్టుకున్నామని, ఫించన్, రేషన్‌కు ఆకివీడు రావాల్సిన దుస్థితి ఏర్పడిందని మహిళలు ఆవేదన వ్యక్తంచేశారు.

ఇళ్ల లబ్ధిదారులను బెదిరించడం దారుణం



మాట్లాడుతున్న గోపాలన్

ఆకివీడు: కుప్పనపూడి శివారు తాళ్లకోడులోని జగనన్న కాలనీలో రీ సర్వే పేరుతో లబ్ధిదారుల్ని బెదిరించడం దారుణమని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్వీ.గోపాలన్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం పెంకి అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2007, 2019లో పేదల్ని గుర్తించే ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చిందని, కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ స్థలాలను పేదల నుంచి వెనక్కి లాగేసుకునేందుకు రీ సర్వే నిర్వహిస్తోందని ఆరోపించారు. కాలనీలో ఇళ్ల నిర్మాణం చేపట్టకపోతే స్థలాలు వెనక్కి తీసుకుంటామని పేదలను బెదిరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పేదల్ని వేధిస్తే చూస్తూ ఊరుకునేదిలేదని, జిల్లావ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

నవధాన్యాలతో భూమికి జవసత్వాలు

- జిల్లాలో 21 ఎకరాల్లో నవధాన్యాల సాగుకు విత్తన కిట్ల పంపిణీ
- భూసారం పెరగడంతోపాటు రైతులకు ఆదాయం
- జిల్లా వ్యాప్తంగా 2.20 లక్షల ఎకరాల్లో నవధాన్యాల సాగుకు ప్రణాళిక

భీమవరం: వ్యవసాయమే జీవనాధారమైన జిల్లాలో రైతన్నలు ఆరుగాలం కష్టపడి ఏటా మూడు పంటలు పండించేవారు. సార్వా, దాళ్వా వరిసాగే కాకుండా దాళ్వా పంట అనంతరం ఆరుతడి పంటలుగా మినుము, పెసర, మొక్కజొన్న, బొబ్బర్లు వంటి వాటితోపాటు పశుగ్రాసానికి పిల్లిపెసర, జనుము, జొన్న వంటివాటిని పండించేవారు. అయితే కొన్నేళ్లుగా వరిసాగులో జాప్యం కారణంగా దాళ్వా వరి పంట ఏప్రిల్, మే నెలల్లో చేతికి రావడంతో మూడవ పంట వేయడానికి సమయం సరిపోవడం లేదు. మూడవ పంటగా అపరాలు, పశుగ్రాసం పండించడం వల్ల భూమికి సహజంగా పోషక పదార్థాలు లభించేవి. మూడవ పంట లేకపోవడంతో రైతులు కేవలం ఎరువులు వేయడం ద్వారానే పంట దిగుబడి పెంచుకోడానికి పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సివస్తుంది. అయితే పాత విధానంతో మూడు పంటలు పండించడానికి వ్యవసాయశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది.



పాలకోడేరు మండలంలో నవధాన్యాల సాగుచేసిన దృశ్యం

సబ్సిడీపై విత్తనాల పంపిణీ

జిల్లాలోని 20 మండలాల పరిధిలో దాదాపు 2.20 లక్షల ఎకరాల్లో వరిసాగు చేస్తుండగా దీనిలో మూడవ పంట పండించేందుకు రైతులను ప్రోత్సహిస్తున్నారు. ప్రస్తుత దాళ్వా సీజన్ ముగింపు దశలో జిల్లాలోని 21,150 ఎకరాల్లో రైతులను అపరాల సాగుతోపాటు పశుగ్రాసం పెంచేందుకు రైతులకు 50 శాతం సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేశారు. దీనికిగాను ప్రత్యేకంగా సేకరించిన మినుము, పెసర, జీలుగు, రాగి, సజ్జలు, నువ్వులు, వేరుశెనగ, ఆవాలు, పిల్లిపెసర, జనుము, మొక్క వంటివాటితోపాటు ఆకుకూరలైన తోటకూర, పాలకూర, మెంతుకూర, చుక్కకూర, గొంగూర, బీర, అనప, దోస వంటి సుమారు 15 రకాలు కలిగిన 12 కిలోల విత్తనాలను కిట్లుగా తయారుచేసి పంపిణీ చేశారు.

ప్రయోజనం ఏమిటంటే..

భూమిలో సారాన్ని సహజంగా పెంచడానికి వేరు వ్యవస్థ ఎంతగానో దోహదం చేస్తుంది. అందువల్ల వివిధ రకాల విత్తనాలు కలగలిపి చేలలో వేయడం వల్ల రైతులకు కొంతమేరకు ఆదాయంతోపాటు ఇంటి అవసరాలు తీర్చుకునే అవకాశం ఏర్పడుతుంది. ప్రధానంగా వివిధ రకాల తీగ, ఆకుజాతి మొక్కల వేర్లు వల్ల భూమిలో బ్యాక్టీరియా వృద్ధి చెంది సహజసిద్ధంగా భూసారం పెరుగుతుంది. దీనితో వరి పండించడానికి ఎక్కువ మోతాదులో ఎరువులు వాడనవసరం లేకపోవడమేగాక తెగుళ్లు కూడా తగ్గే అవకాశముంటుంది. భూమిలో బ్యాక్టీరియా వృద్ధి చెందడం వల్ల రైతులు పంటలకు కొద్దిమొత్తంలో ఎరువులు వేసినా వాటి సామర్థ్యం పెరిగి పంటకు ప్రయోజనం కలుగుతుంది. ప్రస్తుతం కొద్దిమొత్తం విస్తీర్ణం ప్రయోగాత్మకంగా వేసి నవధాన్యాల సాగు రానున్న రోజుల్లో జిల్లా మొత్తం విస్తీర్ణం వేయడానికి రైతులను సన్నద్ధం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

నవధాన్యాల సాగు ఎంతో ప్రయోజనం



దాళ్వా అనంతరం నవధాన్యాల సాగు ఏడాది ప్రయోగాత్మకంగా చేపట్టాం. దాదాపు 21 వేల ఎకరాల్లో రైతులకు సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేశాం. దీని వల్ల రైతులకు కొంతమొత్తం ఆదాయం రావడమే గాక భూసారాన్ని సహజసిద్ధంగా పెంచుకునే అవకాశం ఏర్పడుతుంది. రానున్న రోజుల్లో జిల్లాలోని దాదాపు 2.20 లక్షల ఎకరాల్లో నవధాన్యాలసాగు చేపట్టే విధంగా రైతులకు అవగాహన కల్పిస్తాం.

– జెడ్ వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి, భీమవరం

ముగిసిన సర్టిఫికెట్ల పరిశీలన



నూజివీడు ట్రిపుల్ ఐటీలో ప్రత్యేక కేటగిరి అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

నూజివీడు: నూజివీడు ట్రిపుల్ ఐటీలో గత నాలుగు రోజుల నుంచి నిర్వహిస్తున్న ప్రత్యేక కేటగిరి అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఎన్‌సీసీ, స్పోర్ట్స్, సైనికోద్యోగుల పిల్లలు, భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ కోటాలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్లను ఈనెల 28 నుంచి నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా నాలుగు రోజుల సర్టిఫికెట్ల పరిశీలనలో ఎన్‌సీసీ విభాగంలో మొత్తం 1,454 మందికి గాను 1,101 మంది, స్పోర్ట్స్ కోటాకు సంబంధించి 1,032 మందికి గాను 742 మంది, సైనికోద్యోగుల పిల్లల కోటాకు సంబంధించి 270 మందికి గాను 198 మంది, భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ కోటాకు సంబంధించి 247 మందికి గాను 185 మంది హాజరయ్యారు. సర్టిఫికెట్ల పరిశీలనకు వచ్చిన అభ్యర్థులకు, వారితో పాటు వచ్చిన వారి సహాయకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేశారు. ప్రొఫెసర్ ఎస్ఎస్ఎస్వీ గోపాలరాజు, ఏఆర్ అర్జునరావు సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

భక్తులతో కిటకిటలాడిన శ్రీవారి క్షేత్రం

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్య క్షేత్రం శనివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు, వేసవి సెలవులు కావడంతో వేలాది మంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. దాంతో ఆలయ పరిసరాలు భక్తులతో పోటెత్తాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, కల్యాణకట్ట, నిత్యాన్నదాన సదనం తదితర విభాగాలు భక్తులతో రద్దీగా మారాయి. కొండపైన టోల్‌గేట్, ఘాట్ రోడ్లలో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. దాదాపు 10,500 మంది భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించారు.



శ్రీవారిని దర్శిస్తున్న భక్తులు

ఇండియా రోల్‌బాల్ టీం విజయంలో తణుకు క్రీడాకారులు



శ్రీలంకలో స్వర్ణపతకాలు సాధించిన క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

తణుకు అర్బన్: ఇంటర్నేషనల్ ఇన్విటేషనల్ రోల్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఇండియా రోల్‌బాల్ టీం విజయంలో తణుకు క్రీడాకారులు సత్తా చాటారు. ఈ పోటీల్లో తణుకు మునిసిపల్ స్కేటింగ్ రింక్ పశ్చిమ గోదావరి జిల్లా రోల్ బాల్ అసోసియేషన్ క్రీడాకారులు స్వర్ణ పతకాలు సాధించినట్లు అసోసియేషన్ సెక్రటరీ లావణ్య, కోచ్ చందు తెలిపారు. శ్రీలంకలో గతనెల 29వ తేదీన నిర్వహించిన ఈ పోటీల్లో సీనియర్ కేటగిరీలో రెడ్డి పవన్ హర్షవర్ధన్, జూనియర్ కేటగిరీలో నలమాటి షరత్‌రావు, గుల్లపూడి రంజిత్‌కుమార్, సబ్ జూనియర్ కేటగిరీలో రెడ్డి గగన్‌దీప్ స్వర్ణపతకాలు సాధించారని వివరించారు. తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ క్రీడాకారులను అభినందించారు.

పొగాకు సాగులో విప్లవాత్మక మార్పులు అవసరం

ఐకార్ ఎన్ఐఆర్‌సీఏ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్

బుట్టాయగూడెం: పొగాకు సాగులో విప్లవాత్మక మార్పులు అవసరమని ఐకార్ ఎన్ఐఆర్‌సీఏ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ అన్నారు. జీలుగుమిల్లి ఐకార్ జాతీయ, వాణిజ్య పంటల పరిశోధనా కేంద్రం ఆధ్వర్యంలో శనివారం క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పొగాకు సాగులో ఉత్తమ నాణ్యత, అధిక దిగుబడికి ఉత్తమ యాజమాన్య పద్ధతుల్లో పొగాకు బేరన్‌ల నిర్వహణ గురించి రైతులకు వివరించారు. అలాగే ఈ కార్యక్రమంలో పాల్గొన్న పరిశోధనా కేంద్రం ప్రతినిధి కొడవటి వాసుదేవరావు మాట్లాడుతూ ఐకార్– ఎన్ఐఆర్‌సీఏ, ఐటీసీఎల్, ఎమినెన్స్ గ్యాస్ టెక్నాలజీ సంయుక్తంగా అభివృద్ధి చేసిన గ్యాస్ ఆధారిత పొగాకు బేరన్ పని చేయు విధానాన్ని రైతులకు వివరించారు. గడచిన 30 ఏళ్లుగా పొగాకు రైతులు పొగాకు బేరన్‌లో కలప వాడటం వల్ల అధికంగా వచ్చే కాలుష్యాన్ని నివారించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీసీఎల్ జనరల్ మేనేజర్ వర్నేకర్, సంస్థ చీఫ్ మేనేజర్ లలిత, పొగాకు బోర్డు ఎక్స్‌టెన్షన్ మేనేజర్ సురేఖ, బోర్డు ఆర్ఎమ్ ప్రసాద్, ప్రాజెక్టు హెడ్ డాక్టర్ ఎల్‌కే ప్రసాద్, ఎన్ఐఆర్‌సీఏ ఆర్ఎస్ హెడ్ డాక్టర్ వైవీ సుబ్బయ్య, టి.వెంకటేష్, టి.రమేష్, దేవానంద్, పొగాకు బోర్డు అధికారులు, ట్రేడ్ ప్రతినిధులు, ఎన్ఐఆర్‌సీఏ శాస్త్రవేత్తలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



గ్యాస్ ఆధారిత పొగాకు బేరన్ ద్వారా పండించిన పొగాకు పంటను పరిశీలిస్తున్న దృశ్యం

20 రోజుల తర్వాత మృతదేహం అప్పగింత

నరసాపురం రూరల్: ఇరవై రోజుల తర్వాత మృతదేహాన్ని బంధువులకు రైల్వే పోలీసులు అప్పగించారు. వివరాల ప్రకారం.. నరసాపురం మండలం సీతారాంపురం సౌత్ నేతల వారి పేటకు చెందిన నేతల అనిల్ కుమార్ (20) స్థానికంగా ఓ బేకరిలో పనిచేస్తూ జీవనం సాగించేవాడు. అయితే ఇటీవల మెరుగైన జీవనోపాధి కోసం హైదరాబాద్ వెళ్లిన అనిల్ కుమార్ ఇరవై రోజుల క్రితం తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి మృతి చెందాడు. మృతుని బంధువులు విజయవాడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేయగా 20 రోజుల తర్వాత అనిల్‌కుమార్ మృతదేహాన్ని గుర్తించి శనివారం కుటుంబ సభ్యులకు రైల్వే పోలీసులు అప్పగించారు.



కుళ్లిన స్థితిలో మృతదేహం, నేతల అనిల్‌కుమార్ (ఫైల్)

● నరికినా.. కాసింది

బుట్టాయగూడెం మండలం కామవరంలో గ్రామానికి చెందిన కొమరం వెంకన్న అనే రిటైర్డ్ ఉద్యోగి ఇంటి పెరటిలో నరికేసిన చెట్టు మధ్యలో అరటిగెల వచ్చింది. అయితే అలా రావడం మంచిది కాదని కొందరు చెప్పడంతో వెంకన్న రెండుసార్లు ఆ చెట్టును నరికేసినట్లు తెలిపాడు. అయినప్పటికీ మళ్లీ చెట్టు మధ్యలోనుంచే కాపు వస్తుందంటున్నారు. నరికిన చెట్టు మధ్యలో వచ్చిన అరటిగెలను చూసి పరిసర ప్రాంత ప్రజలు ఆశ్చర్యంగా తిలకిస్తున్నారు.

– బుట్టాయగూడెం



కామవరంలో నరికేసిన చెట్టు మధ్య నుంచి అరటి గెల వచ్చిన దృశ్యం

మహిళకు గాయాలు

పాలకోడేరు: మోటార్‌సైకిల్ సడన్ బ్రేక్ వేయడంతో వెనక కూర్చున్న మహిళ అకస్మాత్తుగా కింద పడి గాయాలపాలైంది. పాలకోడేరు మండలం గొల్లలకోడేరు గ్రామంలో శనివారం ఈ ఘటన జరిగింది. అంతర్వేది దేవి(62) అనే మహిళ పింఛన్ తీసుకుని తన కుమారుడి మోటార్‌సైకిల్‌పై వస్తుంది. గొల్లలకోడేరు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న కారును తప్పించేందుకు మోటార్‌సైకిల్ సడన్ బ్రేక్ వేయగా వెనుక కూర్చున్న ఆమె రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయమైంది. అదే సమయంలో కారు డ్రైవర్ కూడా సడన్ బ్రేక్ వేయడంతో కారు అడ్డం తిరిగి పక్కనే ఉన్న పంట బోదెలోకి దూసుకుపోయింది. వెంటనే స్థానికులు స్పందించి కారులో ఉన్న డ్రైవర్ని బయటకు లాగారు. గాయపడిన మహిళను పాలకోడేరు 108 సిబ్బంది ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స నిమిత్తం భీమవరంలోని ప్రైవేట్ హాస్పిటల్‌కి తరలించారు.



పంట బోదెలోకి దూసుకుపోయిన కారు

విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించారు

ఉండి: ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి జీ సుందర్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో విమర్శించారు. కూటమి ప్రభుత్వం కనీసం టెన్త్ మూల్యాంకనం కూడా సక్రమంగా నిర్వహించలేకపోయిందని ఆరోపించారు. టెన్త్ మూల్యాంకనలో ఫలితాలు అస్తవ్యస్తంగా రావడంతో విద్యార్థులు నష్టపోతున్నారని, ప్రతి విద్యార్థికి ఫీజు చెల్లించకుండానే రీవాల్యూయేషన్ చేయించి మళ్లీ ఫలితాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



జీ సుందర్‌కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

టి.నరసాపురం: వ్యాన్, మోటార్ సైకిల్ ఢీకొన్న ఘటనలో మోటార్‌సైకిలిస్ట్ మృతిచెందాడు. ఎస్సై ఎం జయబాబు తెలిపిన వివరాలివి. చింతలపూడి మండలం బట్టువారిగూడెంకు చెందిన జక్కుల ప్రకాష్ (21) టి.నరసాపురం మండలం కె.జగ్గవరంలో ఓ ఫంక్షన్‌కు వెళ్లి మోటార్‌సైకిల్‌పై తిరిగి వస్తున్నాడు. రాజుపోతేపల్లి అడ్డరోడ్డు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న వ్యాన్ మోటార్‌సైకిల్‌ను ఢీకొనడంతో ప్రకాష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని తండ్రి జక్కుల నరసింహారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.



ఘటనా స్థలంలో జక్కుల ప్రకాష్ మృతదేహం

వ్యాధుల కాలం.. పశువులు జాగ్రత్త



ఆగిరిపల్లి: వర్షాకాలంలో పశువులు వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పశు వైద్యాధికారులు పేర్కొంటున్నారు. పశువుల పట్ల పాడి రైతులు ఏమాత్రం నిర్లక్ష్యం చేసిన వాటి ప్రాణాలకే ప్రమాదం వాటిల్లవచ్చని, పశువులు, గొర్రెలు, మేకల పెంపకం దారులు అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నారు. జీవాలు ప్రమాదకర పరిస్థితిలో ఉంటే వెంటనే 1962 టోల్ ఫ్రీ నెంబర్ ఫోన్ చేస్తే సంచార పశు ఆరోగ్య సేవ వాహనంతో వైద్యులే ఇంటికి వచ్చి చికిత్స అందిస్తారని తెలిపారు. వర్షాకాలంలో పశువులకు వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ఆగిరిపల్లి మండల పశువైద్యాధికారి జి.హనుమంతరావు చేసిన సూచనలు ఇలా ఉన్నాయి.



ఆగిరిపల్లిలో గేదెకు టీకాలు వేస్తున్న పశు వైద్యుడు

గాలి కుంటు వ్యాధిపై అప్రమత్తం

గాలికుంటు వ్యాధి ఎక్కువగా ఆవులు, ఎద్దులు, గేదెలకు సోకుతుంది. వ్యాధి బారిన పడిన పశువు శరీర ఉష్ణోగ్రత 104 నుంచి 105 డిగ్రీలకు పెరుగుతుంది. పశువునోట్లో, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. ఆహారం సరిగా తీసుకోలేవు. దీంతో నీరసంగా మారి నడిచేందుకు కూడా కష్టపడతాయి. పాడి పశువుల్లో అయితే పాల ఉత్పత్తి గణనీయంగా పడిపోతుంది. వ్యాధి నివారణ కోసం వైద్యులు సూచనల మేరకు యాంటీబయోటిక్స్, పెయిన్ కిల్లర్స్ మందులను వాడాల్సి ఉంటుంది.

కలుషిత నీటితో జలగవ్యాధి

మురుగునీరు, కలుషిత నీరు తాగడం వల్ల పశువులకు ఎక్కువగా ఈ వ్యాధి వస్తుంది. ముఖ్యంగా గేదెలు, దూడలు, గొర్రెలు, మేకలు వంటి జీవాలకు ఈ వ్యాధి వస్తుంది. వ్యాధి బారిన పడిన పశువులు మేత తినడంలో ఇబ్బందులు పడతాయి. పాల దిగుబడి క్షీణిస్తుంది. జలగ వ్యాధి బారిన పడిన పశువులను మంద నుంచి వేరు చేయాలి. డిస్టోడిన్ 4 మాత్రలు, 100 మిల్లీ లీటర్ల నియోజడ ప్లస్‌ను అందించాలి.

నట్టల వ్యాధితో ఎదుగుదలకు బ్రేక్

పశువులు పచ్చి మేత తిన్నప్పుడు నులిపురుగుల సమస్య వస్తుంది. దీంతో వాటి ఎదుగుదలకు అవకాశం ఉండదు. జీవాలు తిన్న ఆహారం అంతా నులిపురుగులే స్వాహా చేస్తాయి. దీంతో జీవాలు తరచూ రోగాల బారిన పడే అవకాశం ఉంది. ఎక్కువగా గొర్రెలు ఈ వ్యాధి బారిన పడతాయి. పశుసంవర్ధక శాఖ ముందుజాగ్రత్త చర్యగా ఆరు నెలలకు ఒకసారి పశువులకు నట్టల నివారణ మందులు ఉచితంగా అందిస్తుంది. ప్రస్తుతం పశువైద్య సిబ్బంది నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తున్నారు.

గొంతు వాపు.. ప్రాణాంతకం

పశువులకు సంక్రమించే వ్యాధుల్లో గొంతు వాపు వ్యాధి ప్రాణాంతకమైనది. ఈ వ్యాధి బారిన పడిన పశువులు కంటి నుంచి నీరు కారటం, నోటి నుంచి చొంగకారడం, శ్వాస పీల్చడానికి ఇబ్బందులు పడుతుంటాయి. గొంతు కిందకు నీరు దిగి గొంతు వాపు వస్తుంది. తీవ్రత ఎక్కువైతే పశువులు చనిపోయే ప్రమాదం ఉంది. వ్యాధి నివారణకు ముఖ్యంగా జూన్, జులై నెలల్లో (హెచ్ ఎస్) టీకాలు వేయించుకోవాలి. వ్యాధి బారిన పడిన పశువును మిగిలినవాటి నుంచి దూరం చేయాలి.

ఈటీ వ్యాక్సిన్‌తో చిటుకు వ్యాధికి చెక్

వర్షాకాలంలో పశువులకు ఎక్కువగా సోకే మరో వ్యాధి చిటుకు వ్యాధి. ఈ వ్యాధి వచ్చినప్పుడు జ్వరం తీవ్రత ఎక్కువగా ఉంటుంది. దీని నివారణ కోసం జూన్, జూలై మాసంలో ఈటీ వ్యాక్సిన్ వేస్తారు. రైతులు పశువులకు సంబంధించిన వ్యాధులను సకాలంలో గుర్తించి తగిన వైద్యం అందించాలి.



జి.హనుమంతరావు, పశు వైద్యాధికారి, ఆగిరిపల్లి

పేదల ఆరోగ్యానికి భరోసా ఎక్కడ?

- నిలిచిన ఆరోగ్య ఆసరా నిధులు
- రోగులకు స్కానింగ్‌లు, ఎంఆర్‌ఐలకు వేలాది రూపాయిల ఖర్చు
- వైద్యశిబిరాలు నిల్



తణుకు అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)



తణుకులో ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ క్యాబిన్

తణుకు అర్బన్: పేదల ఆరోగ్యానికి భరోసా లేదని అనారోగ్య సమస్యలతో ఆస్పత్రులకు వెళ్తుంటే పూర్తిస్థాయిలో వైద్యం అందని పరిస్థితులు దాపురించాయని ప్రజానీకం గగ్గోలు పెడుతున్నారు. వైద్యం ఉచితంగా అరకొరగా అందుతున్నా మందుల కొరతతోపాటు వైద్య పరీక్షలకు వేలాది రూపాయిలు కుమ్మరించాల్సి వస్తుందని రోగులు ఆరోపిస్తున్నారు. స్కానింగ్‌లు, ఎంఆర్‌ఐల రూపంలో వేలాది రూపాయిలు చెల్లించాల్సి వస్తుందని వాపోతున్నారు. గతంలో ఎంతో ఉదారంగా అందే వైద్యసేవలు నేడు కుంటుపడే పరిస్థితి దాపురించిందని చెబుతున్నారు.

నిలిచిన ఆరోగ్య ఆసరా

ఆరోగ్య ఆసరా కార్యక్రమం ద్వారా వివిధ విభాగాల్లో శస్త్రచికిత్సలు చేయించుకుని డిశ్చార్జ్ అయ్యే సమయంలో ఆసరా ఎంతో అండగా ఉండేదని రోగులు చెబుతున్నారు. శస్త్రచికిత్స అనంతరం రోగి పౌష్టికాహారం తీసుకునేందుకు విశ్రాంతి సమయంలో రోజుకు రూ. 225 చొప్పున వైద్యులు నిర్దేశించిన కాలానికి నగదు రోగి తాలూకా బ్యాంకు ఖాతాకు జమయ్యేదని, ఇలా రూ. 5వేలు నుంచి రూ. 30వేలు వరకు రోగికి డబ్బు అందే వెసులుబాటు ఉండే పరిస్థితి గత ప్రభుత్వ హయాంలో ఉండేది. ఇందులో భాగంగా అత్యధికంగా న్యూరో కేసుల్లో వేలాది రూపాయిలు రోగికి డబ్బు అందడంతో వారి మందులు, ఇతర ఖర్చులకు ఆ మొత్తాన్ని వినియోగించే పరిస్థితి ఉండేది. కానీ నేటి కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గతేడాది ఆగస్టు నెల నుంచి ఈ ఆరోగ్య ఆసరా పథకాన్ని కూటమి ప్రభుత్వం నిలిపివేసింది. ఆరోగ్య మిత్రలు రోగుల నుంచి ధ్రువపత్రాలు తీసుకుంటున్నా కానీ సొమ్ము మాత్రం వారి బ్యాంకు ఖాతాల్లో జమకావడం లేదని ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా ఆరోగ్యశ్రీలో శస్త్రచికిత్సలకు ముందుగా చేయించుకున్న వైద్య పరీక్షల రిపోర్టులు అనగా స్కానింగ్ పరీక్షల తాలూకా మొత్తాన్ని కూడా చెల్లించే పరిస్థితి జగన్ ప్రభుత్వంలో ఉండగా నేడు ఆ సౌకర్యాన్ని కూడా తొలగించినట్లుగా రోగులు చెబుతున్నారు.

గతంలో ఇంటి గుమ్మంలోకే వైద్యసేవలు

వైఎస్సార్ ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి వార్డులోను ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి స్పెషలిస్ట్ వైద్యులతో వైద్యసేవలు అందచేసే పరిస్థితి ఉండగా నేడు అటువంటి వైద్యసేవల దాఖలా లేలేవని ప్రజానీకం గగ్గోలుపెడుతున్నారు. వైద్య శిబిరానికి రావాల్సిందిగా ప్రతి గడపకు గతంలో వలంటీరు, ఏఎన్ఎంలు వచ్చి టోకెన్‌లు ఇచ్చి మరీ వైద్య శిబిరానికి రప్పించేవారు. కానీ నేడు సర్కారు దవాఖానాలకు వెళ్లినా వైద్యం అందని దుస్థితి నెలకొందంటూ ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

ఆరోగ్యశ్రీ అటకెక్కింది

104, 108 సేవలు అంతంత మాత్రం



పట్టణ ఆరోగ్య కేంద్రం

తాడేపల్లిగూడెం: అలసిన గుండెలు ఆగిపోకుండా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ ఆరోగ్యశ్రీ పేరిట ఊపిరి పోశారు. తండ్రి బాటలో తనయుడు గడచిన ఐదేళ్ల పాలనలో వేల ఆరోగ్య సేవలను ఆరోగ్యశ్రీలో చేర్చి, పరిమితిని 25 లక్షలకు పెంచారు. వేల మందికి అనారోగ్య బాధితులకు ఆరోగ్య ఆసరా దొరికింది. మాయ మాటలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీని అటకెక్కించింది. ఆరోగ్యశ్రీ ట్రస్టుకు బిల్లులు సకాలంలో చెల్లించని కారణంగా ఇటీవల కొన్ని ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేశాయి. ఆరోగ్యశ్రీలు నిలుపుదల చేయడమైనది అనే బోర్డులు ఆసుపత్రులు ముందు సాక్షాత్కరించాయి. బిడ్డలకు జన్మనిచ్చిన తల్లులను సురక్షితంగా ఇంటికి చేర్చే తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఇంధనం లేదన్న కారణంతో షెడ్‌లకు పరిమితమయ్యాయి. వైఎస్సార్ కంటివెలుగు పేరిట గతంలో చేయించిన నేత్ర పరీక్షలు నిలిచిపోయాయి. ఆపద రాగానే కుయ్ కుయ్ మంటూ వచ్చే అంబులెన్సుల సేవలు అంతంత మాత్రంగా ప్రస్తుతం మారాయి. పేదలకు వైద్య సేవలు దాదాపుగా మృగ్యమవుతున్నాయి. అనారోగ్య మస్తు అనే వరం ఈ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చినట్టుగా ఉంది. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద గతంలో ఐదు కోట్ల 56 లక్షల 75 వేల 994 రూపాయల వైద్యం అందింది. వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కింద 13 కోట్ల 96 లక్షల 5313 రూపాయలు వెచ్చించారు. ఈ వైద్య సేవలన్ని ప్రస్తుతం డోలాయమానంలో ఉన్నాయి.

క్లుప్తంగా

వరాల వెంకటేశ్వరస్వామికి విశేష పూజలు



విశేష అలంకరణలో వరాల వెంకటేశ్వరస్వామి

అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసియున్న వరాల వెంకటేశ్వర స్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. వేకువ జామున స్వామి వారికి సుప్రభాతసేవ, తోమాల సేవ జరిపారు. ఉదయం అర్చనలు, ప్రత్యేక పూజలు చేసి, స్వామివారిని విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు దాతల సహకారంతో అన్నదానం చేశారు.

ఘనంగా గోగులమ్మ జాతర



గోగులమ్మకు విశేష పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక కడకట్ల 32వ వార్డులో వేంచేసియున్న గోగులమ్మ జాతర మహోత్సవాలలో భాగంగా శనివారం ఆలయంవద్ద విశేష పూజలు జరిగాయి. అమ్మవారి పుట్టింటి, అత్తింటి వారి నుంచి నైవేద్యాలు సమర్పించారు. గరగలు, ఘటం ధరించిన ఆసాధులు వివిధ ప్రాంతాలలో అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం డాన్స్ అకాడమీ వారిచే కూచిపూడి, జానపద నృత్యాలు జరిగాయి.

అఖండ అన్నసమారాధన



అత్తిలిలో ఆంజనేయస్వామిఆలయం వద్ద అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

అత్తిలి: హనుమద్ జయంతి ఉత్సవాలు ముగింపు సందర్భంగా అత్తిలి గ్రామంలో పంచాయతీ ఎదురుగా ఉన్న శ్రీఅభయాంజనేయ స్వామివారి ఆలయం వద్ద శనివారం అఖండ అన్నసమారాధన జరిపారు. తానింకి అప్పారావు, రత్నం దంపతుల ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిర్వహించిన అన్నసమారాధనకు వేల సంఖ్యలో భక్తులు హాజరై అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



దోమల మందు పిచికారీ చేస్తున్న పెంటపాడు ఆరోగ్యశాఖ సిబ్బంది

పెంటపాడు: మండలంలోని వసతి గృహాల్లో మలాథియాన్ పిచికారీ చేయించినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మణరావు, పెంటపాడు ప్రాథమిక వైద్యాధికారి తోట రాజేష్‌లు తెలిపారు. కీటక జనిత వ్యాధుల నివారణలో భాగంగా శనివారం ముందస్తు జాగ్రత్తలలో ఉన్నతాధికారుల ఆదేశాల అనుసరించి పిచికారీ చేయించినట్లు తెలిపారు. వసతి గృహాల పరిశుభ్రతలో సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో టి. సుబ్బలక్ష్మి, సాయిబాబా, నరేంద్రబాబు, తేజోనాథ్, పూర్ణ, రాజకుమారి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

'గూడెం'లో 14.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, మండలంలో గడిచిన 14.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్ శనివారం తెలిపారు. కాగా, పెంటపాడు మండలంలో ఎటువంటి వర్షపాతం నమోదు కాలేదన్నారు.

రజక చెరువు పూడికతీత పనులు ప్రారంభం



చెరువు పూడికతీత పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కుంచనపల్లి గ్రామంలో కొండాలమ్మ గుడి సమీపంలోని రజక చెరువు పూడిక తీత పనులను శనివారం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ప్రారంభించారు. దాదాపు రూ.4లక్షలతో ఈ పనులు చేపట్టారు. మాజీ ఎమ్పీటీసీ మురళీ, నాయకులు కామేశ్వరరావు, జువ్వల వెంకటేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన ప్రత్యేకాధికారిణి సూర్యకుమారి

తాడేపల్లిగూడెం రూరల్: జిల్లా ప్రత్యేకాధికారిణి ఎ. సూర్యకుమారి తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. శనివారం అధికారులతో కలసి ఈ కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే బి.శ్రీనివాస్‌లతో కలసి పింఛన్లను పంపిణీ చేశారు.

వాకర్స్ సేవలు అభినందనీయం



క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వాకర్స్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. పొగాకు, గుట్కా, పాన్ పరాక్ వంటి ఉత్పత్తులు వాడటం వల్ల నోటి, దవడ, ఊపిరితిత్తులు తదితర క్యాన్సర్‌లు వస్తాయని, టొబాకో ఉత్పత్తులకు దూరంగా ఉండాలని ఎయిర్‌స్ట్రిప్ మహిళా వాకర్స్ అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మి విజ్ఞప్తి చేశారు. పట్టణంలో మహిళా వాకర్స్‌చే శనివారం యాంటీ టొబాక్ డే జరిగింది. ఈ కార్యక్రమంలో కుంట్ల కనకదుర్గ, ఆర్.ఉదయ్‌కుమారి, మేరీ వజ్రమ్మ, వెంకటలక్ష్మి, రామలక్ష్మి, స్మితాదేవి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యోగా రిజిస్ట్రేషన్లను పెంచాలి



తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

తాడేపల్లిగూడెం రూరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రానున్న రెండ్రోజుల్లో యోగాలో పాల్గొనే ఉత్సాహవంతుల రిజిస్ట్రేషన్ల సంఖ్యను పెంచాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సూచించారు. శనివారం తాడేపల్లిగూడెం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ రాహుల్ కుమార్ రెడ్డి తాడేపల్లిగూడెం మండలంలో రిజిస్ట్రేషన్లు తక్కువ కావడంపై ఎంపీడీవోను ప్రశ్నించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యోగా వల్ల కలిగే ఆరోగ్య సూత్రాలను ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 21వ తేదిన అంతర్జాతీయ యోగా దినోత్సవాన ఎక్కువగా ప్రజలు హాజరయ్యేలా చూడాలన్నారు. తొలుత తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఆయన వెంట ఆర్డీవో ఖతీబ్ కౌసర్ భాను, తహసీల్దార్ ఎం. సునీల్ కుమార్, ఎంపీడీవో విశ్వనాథ్ ఉన్నారు.

విద్యార్థి దశ నుంచే జీవిత లక్ష్యాలను ఎంచుకోవాలి



విద్యార్థులకు పొగాకు వల్ల కలిగే వల్ల అనర్థాలను వివరిస్తున్న దృశ్యం



యోగా కార్యక్రమం

అత్తిలి: విద్యార్థులు జీవిత లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించడానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని రిసోర్స్ పర్సన్ జె. రవికుమార్ అన్నారు. వేసవి శిక్షణలో భాగంగా అత్తిలి శాఖా గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పొగతాగడం, మద్యం సేవించడం వల్ల కలిగే దుష్పరిణామాలను రిటైర్డ్ టీచర్ కె. వెంకట్రావు వివరించారు. విద్యార్థుల చేత పంచతంత్ర కథలు చదివించారు. గ్రంథాలయాధికారి డి.కృష్ణారావు, రిటైర్డ్ గ్రంథ పాలకుడు గంధం శేషవేంద్రరావు, ఎం తులసి, సాహితి, ఎం.దుర్గాప్రసాద్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో గ్రేడ్‌-1 శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం అలరిస్తుంది. విజ్ఞాన తరగతులలో భాగంగా శనివారం రిసోర్స్‌పర్సన్లు ప్రత్తి వీరాస్వామి, కోపల్లె శ్రీనివాస్, వి.జనార్ధన్‌రావు, ఎం.పుష్పలతచే జనరల్ నాలెడ్జ్, నీతి కథలు, పొడుపు కథలు, చిట్కాలు చెప్పారు. యోగా కార్యక్రమాలు జరిగాయి. గ్రంథాలయ అధికారి వి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

వేతనాలు పెంచాలని డిమాండ్



నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు

పెంటపాడు: రోజురోజుకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉపాధి వేతనాలు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. శనివారం ఉపాధి కూలీల పనిప్రదేశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మికసంఘ జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ కనీస వేతనం చట్టం ఆధారంగా ఉపాధి వేతనం రూ.600లు పెంచాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలు ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. శ్రామికులకు తక్షణ బకాయిలు విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటి గంగరాజు, దాకే దానయ్య, దొడ్డి రామకృష్ణ, జంగం విజయలక్ష్మి, ఆర్. వెంకటేశ్వర్లు, ఎల్లమిల్లి శ్రీను, కోటి చుక్కల సీతారాముడు తదతరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయంలో అన్నదానం



దుర్గమ్మ ఆలయం వద్ద అన్నసమారాధన దృశ్యం

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడు కాగులంపాడు రోడ్డులో ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసారు. ప్రతి శుక్రవారం అమ్మవారి ఆలయంలో అన్నదానం ఏర్పాటు కార్యక్రమంలో భాగంగా దాతల సహకారంతో సుమారు 300 మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సాతులూరి పవన్‌కుమార్ ప్రత్యేక పూజలు చేసారు. కమిటీ అధ్యక్షుడు బడేటి ఉదయభాను, గ్రామస్తులు, దాతలు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా ఆసనాలు వేస్తున్న అధికారులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని మునిసిపల్ కమిషనర్ ఏసుబాబు తెలిపారు. పదకొండవ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పురపాలక సంఘం కమిషనర్ ఏసుబాబు ఆధ్వర్యంలో యోగాంధ్రను శనివారం ఉదయం స్థానిక గుణ్ణం ఫంక్షన్ హాల్‌లో శ్రీ సత్యసాయి ధ్యాన మండలి నిత్యసాధన కేంద్రంలో నిర్వహించారు. యోగా గురువు బడుగు చంద్రశేఖర్‌చే పలు ప్రొటోకాల్ యోగాసనాలు వేయించారు. ఏసుబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు యోగా యాప్‌లో రిజిస్టర్ కావాలన్నారు. నిరంతరం యోగా చేయాలన్నారు. నిత్యసాధన కుటుంబంతో పాటుగా ఇంట్లో కూడా చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. యోగా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదంపై సమైక్య పోరాటం



సమైక్య యాత్ర నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు అంతా కలిసి పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు అన్నారు. సీపీఎం పిలుపులో భాగంగా ఆ పార్టీ జిల్లా నాయకుల ఆధ్వర్యంలో శనివారం సమైక్యత యాత్ర నిర్వహించారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనం నుంచి పోలీస్ ఐలాండ్ వరకు యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ అందరూ సంఘీభావం తెలిపినా ఆపరేషన్ సిందూర్‌ను కేంద్ర ప్రభుత్వం కొనసాగించలేకపోయిందన్నారు. పార్లమెంట్, అఖిలపక్ష సమావేశాలు నిర్వహించి దేశంలో అందరి మద్దతు కూడగట్టి ఉగ్రవాదాన్ని ఎదుర్కొవాలన్నారు. పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ సిందూర్ ఆపరేషన్‌ను అమెరికా జోక్యంతో ఆపివేయడం సిగ్గుచేటు అన్నారు. ఈ కార్యక్రమంలో జవ్వాది శ్రీను, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, నరమాల కృష్ణ, గోవిందు, రాజు, నాగేంద్రబాబు, నీరుకొండ లక్ష్మీనారాయణ, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌స్టార్ కృష్ణకు ఘన నివాళులు



తణుకులో సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అభిమానులు

తణుకు అర్బన్: సూపర్ స్టార్ ఘట్టమనేని కృష్ణ 82వ జయంతి వేడుకను శనివారం ఆయన అభిమానుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తణుకు టింబరు డిపో ప్రాంతంలో నిర్వహించిన వేడుకల్లో తణుకు కృష్ణ ఫ్యాన్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు పాలంకి బాబ్జి ఆధ్వర్యంలో కృష్ణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పిల్లలకు చాక్లెట్స్, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ తెలుగు చిత్ర పరిశ్రమలో మకుటంలేని మహారాజుగా కృష్ణ కీర్తింపబడ్డారని, కళారంగంలో ఆయన నటన ఆదర్శనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు నమ్మి వాసు, కార్యదర్శి కరెళ్ల శ్రీనివాస్, కోశాధికారి పీవీవీ సత్యనారాయణ, శ్రీను, రవియాదవ్, అభిమానులు పాల్గొన్నారు.

జువ్వలపాలెం బలుసులమ్మకు విశేష పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక జువ్వలపాలెం దేవత బలుసులమ్మ అమ్మవారి జాతర మహోత్సవం సందర్భంగా శనివారం అమ్మవారి పూరిపాక వద్ద బలుసులమ్మను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ దర్శించి, పూజలు జరిపారు. అమ్మవారి పుట్టింటి భక్తులు గుండుమోగుల తమ్మారావు, సురేష్, రాము, నగేష్, అయ్యప్ప, అత్తింటి వారు పాలూరి వెంకటేశ్వరరావు, బలుసులరావు (బూరయ్య), గ్రామస్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భూసార పరీక్షల ప్రాముఖ్యత తెలుసుకోండి



రైతులకు సలహాలు ఇస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

తాడేపల్లిగూడెం: లోతు దుక్కులు, భూసార పరీక్షల ప్రాముఖ్యతను రైతులు తెలుసుకోవాలని వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఉద్యాన విశ్వవిద్యాలయం, కేవికే సంయుక్త ఆధ్వర్యంలో వర్సిటీ పరిధిలోని నల్లజర్ల మండలంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. మార్లమూడి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో కేవికే విస్తరణాధికారి వి.దీప్తి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఖరీఫ్‌నకు అనువైన రకాలు, నవధాన్యాల వాడకం, మినపలో పల్లాకు తెగులు తట్టుకొనే రకాలు, మేలైన యాజమాన్య పద్ధతులు గురించి వివరించారు. ఆయిల్ పామ్‌కు ఆశించే తెల్లదోమ, మొవ్వకుళ్లు తెగులు గురించి డాక్టర్ మేరీ రాణి వివరించారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ రైతులు, అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



గోటేరులో బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న జనసేవక్ ఫౌండేషన్ సభ్యులు

తణుకు అర్బన్: ఇరగవరం మండలం గోటేరు గ్రామానికి చెందిన తోట సత్యనారాయణ అనే వ్యక్తి గుండె శస్త్రచికిత్స కోసం ఉండ్రాజవరం మండలం సావరానికి చెందిన జనసేవక్ ఫౌండేషన్ సభ్యులు శనివారం రూ.1 లక్ష ఆర్థిక సాయాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన సత్యనారాయణ గతంలో ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకున్నప్పటికీ మళ్లీ గుండె సమస్యతో బాధపడుతూ చెన్నైలోని సీఎంసీ ఆస్పత్రికి వెళ్లగా గుండెకు శస్త్రచికిత్స చేయాల్సి ఉందని రూ.10 లక్షలు ఖర్చువుతుందని చెప్పడంతో తమ ఫౌండేషన్ ద్వారా దాతల నుంచి సేకరించిన మొత్తాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందచేసినట్లు సభ్యులు తెలిపారు. ఆర్థిక సాయం అందచేతలో ఫౌండేషన్ సభ్యులు వర్రే బాబి, నార్ని దుర్గారావు, మీసాల సురేష్, ముత్యాల ముత్తయ్య, నార్ని వాసు, కొమ్మిరెడ్డి రామకృష్ణ, నార్ని వెంకట్రావు, గుత్తుల నారాయణ, వరగన పుల్లేశ్వరరావు, నాగిరెడ్డి నాని, గిరుగు మణికంఠ, చల్లా పవన్, మీసాల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయాలి

తాడేపల్లిగూడెం: యోగాంధ్ర ప్రజలందరూ విజయవంతం చేయాలని, నెల రోజుల పాటు రెవెన్యూ సబ్ డివిజన్‌లోని ఐదు మండలాలలోని 90 గ్రామాల్లో యోగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆర్‌డీఓ ఖతీబ్ కౌసర్ భానో కోరారు. యోగా సాధనకు ప్రేరేపించడం, ఈ నెల 21న విశాఖలో జరుగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జూన్ 21 వ తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగాలన్నారు. వెబ్ పోర్టల్, యాప్‌లో అందరిని నమోదుచేసి , యోగా భ్యాస శిక్షణను ఇచ్చి వారికి సర్టిఫికెట్లు జారీ చేయాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించే అన్ని కార్యక్రమాల్లో ప్రజలు, అధికారులు పాల్గొవాలన్నారు. యోగా శిక్షణ, పోటీల్లో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేస్తారన్నారు.

ఉత్తమ పశువుల ఎంపికే లక్ష్యం

పెంటపాడు: రైతుకు లాభసాటిగా ఉండేలా ఉత్తమ జాతి పశువులను ఎంపిక చేసుకొని వాటి జాతిని అభివృద్ధి పరిచేలా పాడి రైతులు కృషి చేయాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి పి. మురళీకృష్ణ పేర్కొన్నారు. శనివారం ఆయన పెంటపాడు మండలంలోని ఆకుతీగపాడులో రైతు మోఖమాట్ల అప్పన్న పశువుల కొట్టంలో అత్యధిక పాలదిగుబడి ఇస్తున్న ముర్రా సంతతికి చెందిన రెండు పశువులను ఉత్తమ జాతిగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పలు విషయాలను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి మహేష్, రేవతి, గోపాలమిత్ర నాగేశ్వరరావు, వీరన్న గ్రామ రైతులు పాల్గొన్నారు.